# పాదుకల వృత్తాంతం

• ఎ.ఎస్.కె.చక్రవర్తి •

## అక్కల్ కోటకర్ మహారాజు గారి భక్తుడు భాయికృష్ణజీ అలిబాగ్ కర్.

ఇతడు అక్కల్ కోటకర్ మహారాజుగారి ఫోటోను పూజించేవాడు. అతనొకసారి షోలాపూరు జిల్లాలోని అక్కల్ కోట గ్రామానికి పోయి మహారాజుగారి పాదుకలు దర్శించి పూజించాలని అనుకున్నాడు. అతనక్కడికి పోక ముందే స్వప్నంలో మహారాజు దర్శనం ఇచ్చి ఇలా చెప్పారు. ప్రస్తుతం శిరిడీ నా నివాసస్థలం. అక్కడికి పోయి నా పూజ చేయి. అందుచేత భాయి కృష్ణజీ తన నిశ్చయాన్ని మార్చుకుని శిరిడీ చేరి బాబా వారిని పూజించి అక్కడే ఆరుమాసాలు ఆనందంగా ఉన్నాడు. దీని జ్ఞాపకార్థం పాదుకలు చేయించి శ్రావణమాసంలో ఒక శుభదినాన వేపచెట్టు క్రింది ప్రతిష్ట చేయించారు. ఇది 1912వ సంవత్సరంలో జరిగింది. దాదాకేల్కార్ ఉపాసనీ బాబా అనేవారు పూజను శాస్త్రోక్తంగా జరిపారు. ఒక దీక్షిత బ్రాహ్మణుడు నిత్యపూజ చేసే దానికి నియమింపబడ్డాడు. దానిని పర్యవేక్షించే అధికారం భక్తసుగుణనకు లభ్యింది.

### కథ యొక్క వివరాలు

1912వ సంవత్సరం బొంబాయి నుండి రామారావు కొఠారె అనే డాక్టర్ శిరిడీ వచ్చాడు. డాక్టర్ మిత్రుడొకాయన ఒక కాంపౌండర్ భాయికృష్ణజీ అలిబాగ్ కర్ అనే అతడు వెంట వచ్చారు. వారు భక్తసుగుణతో జి.కె. దీక్షిత్ తో స్నేహం చేసారు. అనేక విషయాలు తమలో తాము చర్చించుకుంటున్నప్పుడు బాబా వారు ప్రప్రథంగా శిరిడీ ప్రవేశించి వేపచెట్టు క్రింద తపస్సు చేసిన దాని జ్ఞాపకార్థం బాబా వారి పాదుకలను వేపచెట్టు క్రింద ప్రతిష్టించాలని నిశ్చయించుకున్నారు. పాదుకలను రాతితో చెక్కించే దానికి నిశ్చయించారు. అప్పుడు భాయి కృష్ణజీ స్నేహితుడైన కాంపౌండర్ లేచి, ఆ సంగతి డాక్టర్ రామారావు కొఠారెకు తెలిపితే చక్కని పాదుకలు చెక్కిస్తారని చెప్పాడు. అందరూ ఆ సలహాకు సమ్మతించారు. డాక్టర్ గారికి ఈ విషయం తెలియజేశారు. వారు వెంటనే శిరిడీకి వచ్చి పాదుకల నమూనా వ్రాయించారు ఖండోబా మందిరం ముందున్న ఉపాసని మహారాజు వద్దకు వెళ్ళి తాము వ్రాసిన పాదుకల నమూనాను చూపించారు. వారు కొన్ని మార్పులు చేసి. పద్మం, శంఖం చక్రం మొదలైనవి చేర్చి బాబా వారి యోగశక్తిని వేప చెట్టు గొప్పతనాన్ని తెలిపే ఈ క్రింది శ్లోకాన్ని కూడా చెక్కమన్నారు.



సదా నింబవృక్షస్య మూలాధివాసాత్
సుధాస్రావిణం తిక్త మప్యప్రియం తమ్!
తరుం కల్పవృక్షాధికం సాధయంతం
నమామీశ్వరం సద్గురం సాయినాథం!!

ఉపాసనీ సలహాలను ఆమోదించి పాదుకలు బొంబాయిలో చేయించి కాంపౌండర్ ద్వారా పంపారు. శ్రావణ పౌర్ణమి రోజు స్థాపన చేయమని బాబా ఆజ్ఞాపించారు. ఆ రోజు 11 గంటలకు జి.కె.దీక్షిత్ తన శిరస్సుపై పాదుకలు పెట్టుకుని ఖండోబా మందిరం నుండి ద్వారకామాయికి ఉత్సవంతో వచ్చారు. బాబా ఆ పాదుకలను తాకారు. అవి భగవంతుని పాదుకలని సెలవిచ్చారు. చెట్టుక్రింద ప్రతిష్టించమని ఆజ్ఞాపించారు. శ్రావణపౌర్ణమి ముందు రోజు బొంబాయి పాస్తాసేట్ అనే పార్శీ భక్తుడు మనియార్డర్ ద్వారా 25 రూపాయలు పంపాడు. బాబా ఆ పైకం పాదుకలు స్థాపించే ఖర్చు నిమిత్తం ఇచ్చారు. మొత్తం వంద రూపాయలు ఖర్చు పెట్టారు. అందులో 75 రూపాయలు చందాలవల్ల వసూలు చేసారు. మొదటి 5 సంవత్సరాలు జి.కె.దీక్షిత్ అనే బ్రాహ్మణుడు ఈ పాదుకలకు పూజ చేసాడు. తర్వాత లక్ష్మణ్ కచేశ్వర్ జఖాడె అనే బ్రాహ్మణుడు పూజ చేయసాగాడు మొదటి 5 సంవత్సరాలు నెలకు 2 రూపాయల చొప్పున డాక్టర్ కొఠారె దీపపు ఖర్చు నిమిత్తం పంపుతుండెను. పాదుకల చుట్టూ కంచెకూడా పంపారు. ఈ కంచె, పై కప్పును కోపర్ గాం స్టేషన్ నుండి శిరిడీ తెచ్చేదానికి అయిన ఖర్చు భక్త సగుణుడు నైవేద్యం దీపం పెడుతున్నాడు.

మొట్టమొదట భాయికృష్ణజీ అక్కల్ కోటకర్ మహారాజు భక్తుడు. 1912వ సంవత్సరంలో వేప చెట్టు క్రింద పాదుకలు స్థాపించేటప్పుడు అక్కల్ కోటకు పోతూ మార్గమధ్యలో శిరిడీలో దిగారు. బాబా వారి దర్శనం చేసుకున్న తర్వాత అక్కల్ కోట గ్రామానికి పోవాలని బాబావారి వద్దకు వెళ్ళి అనుమతి నిమ్మన్నారు. బాబావారు అప్పుడు ఇలా అన్నారు. "అక్కల్ కోటలో ఏముంది? అక్కడికి ఎందుకు వెళతావు? అక్కడుండే మహారాజు ప్రస్తుతం ఇక్కడున్నారు. వారు నేనే". ఇది విని భాయికృష్ణజీ అక్కల్ కోట వెళ్ళడం మానుకున్నారు. పాదుకల స్థాపన తర్వాత అనేక పర్యాయాలు శిరిడీ యాత్ర చేసారు.